


RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 251 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 02-1-2026 పేజీలు-8 | వెల: రూ. 5.00

# నీటి హక్కుల విషయంలో రాజీపడం

## జల వివాదాలతో లబ్ధిపొందాలని బీఆర్ఎస్ కుట్ర

- కేసీఆర్ నిర్ణయాలే రాష్ట్రానికి శాపంగా మారాయి
- శాసనసభకు రండి చర్చిద్దాం
- మీ గౌరవానికి ఎలాంటి భంగం కలగదు : ప్రతిపక్షనేతకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- నీళ్లు, నిజాలపై మంత్రి ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- హాజరైన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులు
- నేటి నుంచి మళ్లీ అసెంబ్లీ సమావేశాలు



హైదరాబాద్

తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. 'నీళ్లు–నిజాలు' అనే అంశంపై గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ, శాసన మండలి సభ్యులు, కార్పొరేషన్ చైర్మెన్లు ఇతర ప్రజా ప్రతినిధులకు రాష్ట్ర నీటి పారుదల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత నీటివాటాలు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, వాటివల్ల ఎదురైన ఇబ్బందులు, ప్రజాప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించారు. అనంతరం ఇదే అంశంపై జరిగిన విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

-మిగతా 2 లో



## పెరుగనున్న సిగరెట్లు, బీడీ, పాన్ మసాలా ధరలు..

- పొగాకు, పాన్ మసాలాపై 40% జీఎస్‌టీ
- ఫిబ్రవరి 1 నుంచి అమలు
- భారీగా పెరుగనున్న ధరలు

న్యూఢిల్లీ, -

పొగాకు,పాన్ మాసాలా ఉత్పత్తులపై ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కొత్త పన్ను విధానం అమల్లోకి రానున్నది. ఈ ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న జీఎస్‌టీ రేట్లకు అదనంగా అదనపు ఎక్సైజ్ సుంకాన్ని, హెల్త్ సెస్సును కేంద్రం విధించడంతో ఈ కొత్త పన్ను విధానం అమలు కానున్నది. హానికర వస్తువులుగా పరిగణించే ఈ ఉత్పత్తులపై ప్రస్తుతమున్న నష్టపరిహార సెస్సు స్థానాన్ని కొత్త పన్ను విధానం భర్తీ చేస్తుంది.పొగాకు, దాని అనుబంధ ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం పడనుండగా పాన్ మసాలాపై ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్సు పడనున్నది. ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం పాన్ మసాలా, సిగరెట్లు, పొగాకు, తదితర

-మిగతా 2 లో



## మెట్రోపై సర్కారు పట్టు!

- సాంకేతికత అధ్యయనం కోసం రెండు కమిటీలు ఏర్పాటు
- ముంచుకొస్తున్న స్వాధీన గడువు
- ఎల్ అండ్ టీ సాంకేతికత, ఇతర రాష్ట్రాల్లోని మెట్రోరైల్ టెక్నాలజీలపై వేర్వేరుగా నివేదికలు ఇవ్వాలని సర్కారు ఆదేశాలు

హైదరాబాద్-

మెట్రో రైల్ నిర్వహణ, సాంకేతిక అంశాల అధ్యయనానికి రెండు కమిటీలను ఏర్పాటు చేస్తూ హైదరాబాద్ మెట్రోరైల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ నిర్ణయం తీసుకున్నారు. దీనికోసం ప్రత్యేకంగా కన్సల్టెంట్ నియమికాన్ని పరిశీలిస్తున్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ మొదటి దశ (ఫేజ్–1)ను ఎల్‌అండ్‌టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకునే ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు సమాచారం. కేవలం ఆర్థిక అంశాలే కాకుండా, మెట్రోకు సంబంధించిన నిర్వహణ, సాంకేతిక సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ఈ రెండు కమిటీలను ఏర్పాటు చేశారు. మొదటి దశలో ఎంపికైన ఏజెన్సీలకు కేవలం ఆర్థిక, న్యాయపరమైన అంశాలపైనే అవగాహన ఉంది. కానీ మెట్రో వంటి అత్యాధునిక వ్యవస్థను

-మిగతా 2 లో



## ఇరాన్‌లో జెన్‌జీ ఉద్యమం

- ఖమేనీకి వ్యతిరేకంగా రోడ్డెక్కిన యువత
- హింసాత్మక ఘర్షణల్లో పలువురు మృతి

టెహ్రాన్,-

ఇరాన్ సుప్రీమ్ నాయకుడు అయాతొల్లా అలీ ఖమేనీకి వ్యతిరేకంగా గతవారం రోజులుగా సాగుతున్న నిరసనలు నూతన సంవత్సరం నాడు హింసాత్మకంగా మారాయి. పలువురు నిరసనకారులతోపాటు ఓ భద్రతా సిబ్బంది ఈ ఘర్షణల్లో మరణించినట్లు ఇరాన్ మీడియా, హక్కుల గ్రూపులను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తాసంస్థ తెలిపింది. కొత్త సంవత్సరం రాకతో ప్రజా నిరసనలు దేశంలోని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాయి. దేశవ్యాప్తంగా భద్రతా దళాలతో నిరసనకారులు తలపడ్డారు.ఈ ఘర్షణల్లో ముగ్గురు పౌరులు మరణించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. నియంత(ఖమేనీ)కు మరణదండన విధించాలని నినాదాలు చేస్తూ యూనివర్సిటీ విద్యార్థులు టెహ్రాన్ వీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు. 1979 ఇస్లామిక్ విప్లవం సందర్భంగా పదవీచ్యుతుడైన అమెరికా మద్దతుదారు షా మొహమ్మద్ రేజా పహ్లవీ కుమారుడు రేజా పహ్లవీకి అనుకూలంగా విద్యార్థులు నినాదాలు చేశారు. టెహ్రాన్ వ్యాప్తంగా షాకు కీర్తిస్తూ నినాదాలు మార్మోగిన దరిమిలా అమెరికాలో ప్రవాస జీవితాన్ని గడుపుతున్న రేజా పహ్లవీ ఎక్స్ వేదికగా స్పందించారు.తాను మీతోనే ఉన్నానని, తమ పోరాటం న్యాయమైనది కాబట్టి విజయం

-మిగతా 2 లో

## న్యూ ఇయర్‌లో రాష్ట్ర ఖజానాకు కిక్కు

- రూ.వెయ్యి కోట్ల మద్యం తాగేశారు
- 7.78 లక్షల కేసుల బీరు అమ్మకాలు
- ఆరోగ్యాన్ని లెక్కచేయని మందుబాబులు



హైదరాబాద్ -

మద్యం తాగితే ఆరోగ్యానికి చేటు అంటున్నా మందుబాబులు అస్సలు ఆగటం లేదు. పైగా న్యూ ఇయర్ సందర్భంగా తాగుతున్నామంటూ తెగ తాగేశారు. దీంతో రాష్ట్రంలో భారీగా మద్యం విక్రయాలు జరిగాయి. మూడు రోజుల్లో దాదాపు రూ.వెయ్యి కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్టు అబ్కారీ శాఖ అధికారులు లెక్కగట్టారు. 2024 డిసెంబర్ నెల చివరి మూడు

-మిగతా 2 లో

## పట్టణ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- 5లోగా అభ్యంతరాలకు గడువు
- 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో పోలింగ్‌స్టేషన్ల వారీగా జాబితాల ప్రదర్శన
- ఎస్ఈసీ టీ-పోల్ సైట్‌లోనూ ఓటర్ల వివరాలు



హైదరాబాద్,

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు మరో కీలక ముందడుగు పడింది. 117 మున్సిపాలిటీలు, ఆరు మున్సిపల్ కార్పొరేషన్ల వార్డుల్లోని పోలింగ్‌స్టేషన్‌వారీగా సిద్ధంచేసిన ముసాయిదా ఓటర్ల జాబితాను (డ్రాఫ్ట్ ఓటరు లిస్టు) రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) గురువారం అధికారికంగా విడుదల చేసింది. రాజ్యాంగ నిబంధనలు, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం–2019 ప్రకారం ఈ ఓటర్ల జాబితాను రూపొందించినట్టు ఎస్ఈసీ కార్యదర్శి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఓటర్ల సౌకర్యార్థం ఈ ముసాయిదా జాబితాలను అన్ని వార్డు, మున్సిపల్ కమిషనర్,

-మిగతా 2 లో

# సారొస్తారా!

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాకపై ఉత్కంఠ



- కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో కీలక చర్చ
- సభకు హాజరుకావాలంటున్న అధికార పక్షం
- సర్కారు నిర్లక్ష్యంపై నిలదీతకు ప్రతిపక్షం సిద్ధం
- విపక్షాల ప్రశ్నలకు గట్టి సమాధానమివ్వనున్న ప్రభుత్వం

హైదరాబాద్ ,-

అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) రాకపై ఉత్కంఠ నెలకొంది. గతనెల 29న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజు ఆయన హాజరయ్యారు. అలా వచ్చి ఇలా వెళ్లిపోయారు. సభలో కేవలం ఏడు నిమిషాలు మాత్రమే ఉన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరై సంతకం పెట్టకుంటే అనర్హత వేటు పడుతుందనీ, జీతం రాదు కాబట్టే వచ్చి వెళ్లారన్న విమర్శలు వెల్లువెత్తాయి. అయితే గతనెల 21న బీఆర్ఎస్ఎల్పీ, రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని తెలంగాణ భవన్‌లో నిర్వహించారు. అనంతరం కేసీఆర్ విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల తెలంగాణకు,

-మిగతా 2 లో



## న్యూ ఇయర్ వేడుకల్లో స్విట్జర్లాండ్ బార్‌లో పేలుడు

- సుమారు 40 మంది మృతి
- 100 మందికిపైగా గాయాలు

న్యూఢిల్లీ, -

నూతన సంవత్సరం వేడుకలు జరుపుకుంటున్న వేళ స్విట్జర్లాండ్‌లోని ఓ విలాసవంతమైన బార్‌లో బుధవారం అర్ధరాత్రి పేలుడు సంభవించి 40 మంది వరకు మరణించగా, మరో 100 మంది గాయపడ్డారని స్విస్ పోలీసులను ఉటంకిస్తూ ఇటలీ విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది. అయితే మృతుల సంఖ్య పదుల సంఖ్యలో ఉంటుందని స్విస్ పోలీసులు తెలిపారు. క్రాన్స్ మోంటానా పట్టణంలోని లె కాన్స్టెలేషన్ బార్‌లోని బేస్‌మెంట్‌లో, లాంజ్‌లో పేలుడు సంభవించినట్లు స్విస్ అధికారులు చెప్పారు. ఇది ఉగ్రదాడి కాదని, మంటలు చెలరేగడంతో పేలుడు సంభవించి ఉండవచ్చని వారు చెప్పారు.పేలుడు జరిగిన సమయంలో బార్‌లో 150 మందికిపైగా ఉన్నారని వారు తెలిపారు. అసాధారణ రీతిలో దేశంలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొని అడవులు దగ్ధం అవుతున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా బాణసంచా పేల్చడంతో ఈ పేలుడు జరిగి ఉంటుందని స్విస్ మీడియా అనుమానం వ్యక్తం చేసింది. అయితే పోలీసులు మాత్రం పేలుడుకు కారణం ఇంకా తెలియరాలేదని స్పష్టం చేశారు.

-మిగతా 2 లో

## త్వరలో వందే భారత్ స్లీపర్ రైళ్లు

- గువాహటి-కోల్‌కతా మధ్య తొలి రైలు
- సర్వీసుత్వరలో హైదరాబాద్ నుంచి కూడా..



హైదరాబాద్,-

: వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లు త్వరలో రాబోతున్నాయి. ఈ ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్న పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాలను కలుపుతూ గువాహటి–కోల్‌కతా మధ్య తొలి రైలును ప్రారంభించేందుకు కేంద్రంలోని మోదీ సర్కారు సిద్ధమవుతున్నది. ప్రస్తుతం ఈ రైళ్లకు దేశ వ్యాప్తంగా డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లు కూడా

-మిగతా 2 లో

# నీటి హక్కుల విషయంలో రాజీపడం

మొదటి తరువాయి

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నీటి హక్కుల విషయంలో అడుగడుగునా అన్యాయం జరిగిందని విమర్శించారు. ఇంటర్ స్టేట్ డిస్ప్యూట్ యాక్ట్ 1956 ప్రకారం ఏర్పడిన జస్టిస్ బచావత్ నేతృత్వంలో కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్-1 (కేడబ్ల్యూడీటీ) ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు కేటాయించిందని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు దక్కిన 299 టీఎంసీలపై పోరాటం చేయకపోగా సమ్మతిస్తూ అపెక్స్ కౌన్సిల్‌లో అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వం సంతకాలు చేసిందన్నారు. 2014 నుంచి వరుసగా మూడేండ్లు ఒక్కో సంవత్సరం చొప్పున, ఆ తర్వాత 2020లో కేడబ్ల్యూడీటీ తుది అవార్డు వచ్చే వరకు పాత పంపకాలకు కట్టుబడతామని లిఖితపూర్వకంగా ఒప్పుకున్నారని వివరించారు. కేసీఆర్ చేసిన సంతకాల వల్లే కృష్ణా నదిలో తెలంగాణ నీటి హక్కులను కోల్పోయిందని గుర్తు చేశారు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం కేటాయించిన 811 టీఎంసీల్లో 70 శాతం కృష్ణా పరివాహక ప్రాంతం ఉన్న తెలంగాణకు న్యాయబద్ధంగా 555 టీఎంసీలు, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ మధ్యంతర అవార్డు ప్రకారం 763 టీఎంసీలు దక్కాల్సి ఉందని సీఎం చెప్పారు. న్యాయమైన వాటాలు రాబట్టుకోవడం కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనీ, కేంద్రంపై ఎలాంటి ఒత్తిడి తేలేదని ఆక్షేపించారు. శ్రీశైలానికి మార్చడం వెనుక కుట్ర కోణంపాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం ద్వారా కృష్ణాలో ఏపీ జల దోపిడీకి బీఆర్ఎస్ ద్వారాలు తెరిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ మార్పునకు సంబంధించి కనీసం మంత్రివర్గ అనుమతి కూడా తీసుకోలేదన్నారు. మూడు టీఎంసీల నుంచి ఏకంగా ఏపీ రోజుకు 13 టీఎంసీలను తరలించుకుపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణాపై ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం 0.25 శాతం నీళ్లు కూడా తీసుకుపోయే మెకానిజం లేదనీ, ప్రతిపాదించిన పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ, దిండి తదితర ప్రాజెక్టలన్నీ పూర్తయినా రోజుకు నాలుగు టీఎంసీలు కూడా తీసుకుపోలేమని చెప్పారు. ఆనాడు రూ.32 వేల కోట్లతో వేసిన ప్రాజెక్ట్ అంచనా, ఇప్పుడు రూ.84 వేల కోట్లకు చేరిందని తెలిపారు. మూడు లిఫ్టలను ఐదు లిఫ్టలకు మార్చడంలో దోపిడీ



దాగుందన్నారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా కమిషన్ల కోసమే కేసీఆర్ మార్చారని ఆరోపించారు. ఉమ్మడి ఏపీలో రూ.35 వేల కోట్లున్న ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయాన్ని రూ.1.5లక్షల కోట్లకు చేర్చారని చెప్పారు. అంచనాలు పెంచడం ద్వారా కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. మనుగడ కోసమే బీఆర్ఎస్ జలవివాదం2023 తర్వాత వరుసగా జరిగిన అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైందని సీఎం గుర్తు చేశారు. రాష్ట్రంలో ఆ పార్టీ మనుగడ కష్టమనే భావించి రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాలు సృష్టించి పబ్బం గడుపుకునేందుకు కేసీఆర్ కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పార్టీని బతికించుకునేందుకు తాను ఏపీ సీఎం చంద్రబాబుకు సహకరిస్తున్నానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లు అబద్ధాలను ప్రచారం చేయడంలో ఆరితేరి పోయారని ఎద్దేవా చేశారు. నిన్నటి వరకు కృష్ణాలో నీటి దోపిడీ జరుగుతోందని గగ్గోలు పెట్టిన బీఆర్ఎస్.. అపెక్స్ కౌన్సిల్‌లో వారు చేసిన సంతకాలను బయట పెట్టడంతో పాటు జూరాల స్థల మార్పుపై విచారణకు ఆదేశించాలని నిర్ణయించిన క్రమంలో రూటు మార్చి గోదావరి నల్లమల సాగర్‌ను ఎత్తుకున్నారని విమర్శించారు. కేసీఆర్ చేసిన ఆర్థిక నేరాలకు మిడిల్ ఈస్ట్ దేశాల్లో అయితే బహిరంగంగా ఉరి తీస్తారని వ్యాఖ్యానించారు. అన్నింటా దొరికి పోవడంతో తెలంగాణ నీటి పారుదల సలహాదారు ఆదిత్యనాథ్ ఆంధ్రకు చెందిన వారని కొత్త నాటకానికి తెరతీశారని చెప్పారు. ఆయన ఆంధ్రా క్యాడర్‌లో పని చేసిన బీహార్‌కు చెందిన వ్యక్తి అని వివరణ ఇచ్చారు. కేసీఆర్ తన పదేండ్ల కాలంలో ఉమ్మడి ఏపీలో పని చేసిన ఎంతో మంది ఐఏఎస్ అధికారులను తీసుకున్నారని గుర్తు చేశారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా కృష్ణా నీటి వాటాలో 71 శాతం తెలంగాణకు, 29శాతం ఏపీకి ఇవ్వాలని పోరాడుతామని స్పష్టం చేశారు. వాస్తవాలను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నేతలు అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్నారు. కేసీఆర్ వల్లే నీటి వాటాల్లో తెలంగాణకు అన్యాయం: ఉత్తమ్‌బీఆర్ఎస్ పదేండ్ల పాలనలోనే నీటి వాటాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా తెలంగాణకు బీఆర్ఎస్ చేసిన అన్యాయాన్ని అంకెలతో సహా వివరించారు. "బచావత్ ట్రిబ్యునల్ పంపకాల్లో జరిగిన వివక్షను తెలంగాణ ఏర్పడ్డ తర్వాత అడ్డుకోలేదు. బచావత్ అవార్డు ప్రకారం ఏపీకి 66 శాతం (512టీఎంసీలు), తెలంగాణకు 34 శాతం (299టీఎంసీలు) కేటాయింపులను అంగీకరిస్తూ అపెక్స్ కౌన్సిల్, కేఆర్ఎంబీ బోర్డు మీటింగుల్లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులు సంతకాలు చేశారు. వారి సంతకాలే తెలంగాణకు నేడు మరణశాసనం అయ్యాయి. 2015లో పాలమూరు అంచనా వ్యయం రూ.35 వేల కోట్లు. జీవో ఇచ్చిన ఏడేండ్ల తర్వాత ప్రభుత్వం కేంద్రానికి డీపీఆర్ పంపించింది. అందులో ఆయకట్టు వివరాలు లేక పోగా రూ.55 వేల కోట్ల వ్యయం అవుతుందని పేర్కొన్నారు. రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి ఎకరానికి కూడా నీరివ్వలేదు. ప్రాజెక్ట్ పూర్తి కావాలంటే ఇంకా రూ.80 వేల కోట్లు కావాల్సి ఉంది. 36 శాతం పనులు పూర్తయితే 90 శాతం పూర్తయ్యాయని అబద్ధాలు చెబుతున్నారు. తమ ప్రభుత్వం రెండేండ్లలో రూ.7 వేల కోట్లు ఖర్చు చేసింది. తట్టెడు మట్టి తీయలేదని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నది. వాస్తవాలను ఇక్కడికొచ్చిన ప్రజా ప్రతినిధులు వాస్తవాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలి" అని ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు.

# మెట్రోపై సర్కారు పట్టు!

మొదటి తరువాయి

నడపాలంటే సాంకేతిక లోతుపాతులు తెలియాలి. అందుకే సాంకేతిక సమగ్ర పరిశీలన (టెక్నికల్ డ్యూ డిలిజెన్స్ ఆడిట్)ను క్రాస్ చెక్ చేయడం కోసం ఈ రెండు కమిటీల నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ప్రస్తుత మూడు కారిడార్లలో 69.2 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఆర్థిక, న్యాయపరమైన అంశాలను పరిశీలించే ఏజెన్సీలకు, దాని సాంకేతిక భాగాలను అంచనా వేసే నైపుణ్యం లేకపోవచ్చుని ప్రభుత్వం గుర్తించినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నట్లు ఓ ఆంగ్లపత్రిక కథనంలో వెల్లడించింది. మొదటి కన్సల్టెంట్ అయిన 'నాన్-టెక్నికల్ సోవరిన్ ఆడిట్' కోసం టెండర్ ఖరారు చేసే దశలో షార్ట్‌లిస్ట్ చేయబడిన ఎస్బీఐ క్యాప్, పీఎన్బీ వంటి ఏ ఏజెన్సీలకు కూడా సాంకేతిక అంశాలను అంచనా వేసే సామర్థ్యం లేదని స్పష్టమైంది. దీనికి మెట్రో రైల్, రైల్వే టెక్నాలజీలో అనుభవం ఉన్న సిబ్బంది అవసరమని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే రైలు పెట్టెలు, ఎలక్ట్రిక్ ట్రాక్షన్, సిగలింగ్, ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ మొదలైన వాటిని అంచనా వేయడానికి మెట్రో రైల్ టెక్నాలజీలో నైపుణ్యం ఉన్న వారితో వేర్వేరుగా రెండు కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత ఇస్తే ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ), రైట్స్ (ఆర్ఐటీఈఎస్), నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎన్‌సీఆర్‌టీసీ) వంటి పబ్లిక్ సెక్టార్ సంస్థలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే విదేశీ నిపుణులైన కన్సల్టెంట్ల భాగస్వామ్యం వైపు కూడా దృష్టి సారిస్తున్నట్టు సమాచారం. 2026 మార్చి 31 కంటే ముందే ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రోను స్వాధీనం చేసుకోవాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి గడువు విధించారు. ఇందులో భాగంగా ఫేజ్-1 ఆర్థిక, సాంకేతిక అంశాల పరిశీలనను 100 రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని కమిటీకి ఆదేశాలు ఇచ్చారు. కాగా.. సమగ్ర ఆడిట్‌కు నాలుగు నుంచి ఐదు నెలల సమయం పట్టవచ్చని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఎల్‌అండ్‌టీఎంఆర్‌హెచ్‌నకు సంబంధించి అనేక స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఒప్పందాలు ఉన్నాయి. కన్సల్టెంట్ ఏజెన్సీలు వీటిని క్షుణ్ణంగా పరిశీలించాలి. తద్వారా ఇవి భవిష్యత్తులో చట్టపరమైన అడ్డంకులుగా మారకుండా ఉంటాయని ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. మూడు నెలల క్రితం ఎల్‌అండ్‌టీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. అప్పుతో సహా రూ.15,000 కోట్ల చెల్లింపును ప్రభుత్వం ప్రాజెక్ట్‌ను తన ఆధీనంలోకి తీసుకునే ముందే సెటిల్ చేయాల్సి ఉంటుంది. సుమారు రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్ల విస్తరణ చేపట్టే హైదరాబాద్ మెట్రో ఫేజ్-2లో ఎల్‌అండ్‌టీ భాగస్వామ్యం కావడానికి నిరాకరించింది. దీంతో ఫేజ్-1ను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా ఉన్న సుమారు 200 ఎకరాల భూమిని నగదుగా మార్చుకోవడం, అలాగే ఫేజ్-1 అభివృద్ధి చేసిన నాలుగు మాల్స్‌తో సహా వాణిజ్య స్థలాలను అభివృద్ధి చేయడం వంటి ప్రణాళికలు పరిశీలనలో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# సారొస్తారా!

మొదటి తరువాయి

ప్రజలకు ఎంత నష్టం కలుగుతుందో వివరించారు. బీఆర్ఎస్ హయాంలో రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి 90శాతం పనులు పూర్తి చేసినా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి ఖర్చు చేయలేదనీ, తట్టెడు మట్టి తీయలేదని విమర్శించారు. పైగా ఆ ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రం వెనక్కి పంపించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమాలకు శ్రీకారం చుడతామనీ, మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో బహిరంగ సభలను నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో అసెంబ్లీ వస్తే అన్ని విషయాలనూ చర్చిద్దామంటూ సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. అనుకున్నట్టుగానే గతనెల 29న మొదటి రోజు అసెంబ్లీకి కేసీఆర్ హాజరయ్యారు. అయితే శుక్రవారం జరిగే అసెంబ్లీ సమావేశాల్లో కృష్ణా, గోదావరి జలాలపై కీలక చర్చ జరగనుంది. కేసీఆర్ ప్రశ్నలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చే సమాధానం కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సభకు కేసీఆర్ హాజరవుతారా? లేదా?అన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది. హాజరు డౌటే ! అందుకే ఉపనేతల నియామకంబీఆర్ఎస్ఎల్పీ ఉప నేతలుగా మాజీమంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పి సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కేసీఆర్ నియమించారు. శాసనమండలిలోనూ ఉపనేతలుగా ఎల్ రమణ, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. బీఆర్ఎస్ఎల్పీ ఉపనేతల నియామకంతో కేసీఆర్ సభకు వచ్చేది అనుమానమేనన్న అభిప్రాయం వినిపిస్తున్నది. ఆయన ఫాంహౌజ్‌లోనే ఉన్నారు. ఒకవేళ అసెంబ్లీకి హాజరు కావాలనుకుంటే గురువారం సాయంత్రం నాటికి నందినగర్‌లోని నివాసానికి చేరుకోవాలి. కానీ ఇప్పటి వరకు చేరుకోలేదు. దీంతో కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే అవకాశం ఉండకపోవచ్చని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అయితే బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ప్రాజెక్టుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, అలసత్వాన్ని గట్టిగా ప్రశ్నించాలని భావిస్తున్నది. ఈ దిశగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు ఏపీ ప్రభుత్వంతో రాజీపడడం, మోడీకి, చంద్రబాబుకు సీఎం రేవంత్‌రెడ్డి భయపడి నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలను సభలో నిలదీసేందుకు సిద్ధమవుతున్నది. ఏపీ జలదోపిడీతో తెలంగాణకు జరుగుతున్న నష్టాన్ని ప్రజలకు మరోసారి వివరించనుంది. అయితే కృష్ణా, గోదావరి జలాల విషయంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన తప్పులను ఎత్తిచూపేందుకు అధికార పక్షం సిద్ధమవుతున్నది. విపక్షాల ప్రశ్నలకు ధీటైన సమాధానాలు ఇచ్చేందుకు మంత్రులు రెడీగా ఉన్నారు. గురువారం ప్రజాభవన్‌లో నదీజలాలపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బీఆర్ఎస్ హయాంలో తీసుకున్న నిర్ణయాల వల్ల తెలంగాణకు ఎలా నష్టం కలిగిందో చెప్పారు. ఇదే విషయాలను అసెంబ్లీలోనూ అధికార పక్షం బలంగా వినిపించనుంది. కేసీఆర్ సభకు రావాలని కాంగ్రెస్ కోరుతున్నది.

# పెరుగనున్న సిగరెట్లు, బీడీ, పాన్ మసాలా ధరలు..

మొదటి తరువాయి



అనుబంధ ఉత్పత్తులపై జీఎస్టీ కింద 40 శాతం పన్ను ఉంటుంది. బీడీలపై 18 శాతం జీఎస్టీ విధిస్తారు. ఈ జీఎస్టీ రేట్లు కొనసాగిస్తూ విడిగా అదనపు లెవీలను విధిస్తారు. తాజా నిర్ణయం నేపథ్యంలో సిగరెట్ ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నది.

# ఇరాన్‌లో జెన్‌జీ ఉద్యమం

మొదటి తరువాయి



తమదేనని ఆయన నిరసనకారులను ఉద్దేశించి ప్రకటించారు. ధరల పెరుగుదలపై గత మూడేండ్లుగా ఇరాన్‌లోని అనేక ప్రాంతాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. అనేక ప్రాంతాల్లో నిరసనకారులకు, భద్రతా సిబ్బందికి మధ్య ఘర్షణలు చెలరేగాయి. లార్దేగన్, కుహదష్ట్, ఇస్ఫాహన్‌లో మరణాలు సంభవించినట్లు వార్తలు వచ్చాయి

# న్యూ ఇయర్‌లో రాష్ట్ర ఖజానాకు కిక్కు

మొదటి తరువాయి

రోజుల్లో రూ.736 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరగ్గాడ 2025 డిసెంబర్ చివరి మూడు రోజుల్లో రూ.980 కోట్లకు పైగా విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్టు అబ్కారీ శాఖ చెబుతోంది. నూతన మద్యం విధానంలో భాగంగా కొత్తగా లైసెన్స్‌లు పొందిన దుకాణదారులు డిసెంబర్ నుంచి మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. రాష్ట్రంలోని మొత్తం 3,620 మద్యం దుకాణాలు, దాదాపు 1,100 బార్‌లు, పబ్‌లు, క్లబ్‌లు కలిసి డిసెంబర్ నెలలో రూ.4,920 కోట్ల విలువైన మద్యాన్ని డిపోల నుంచి కొనుగోలు చేశారు. డిసెంబర్ 25 నుంచి 31 వరకు మద్యం విక్రయాల విలువ రూ.1350 కోట్లకుపైగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. డిసెంబర్ 29న రూ.280 కోట్లు, 30న రూ.380 కోట్లు, 31న రూ.315 కోట్లకు పైగా విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. ఈ మూడు రోజుల్లోనే దాదాపు రూ.1000 కోట్లు విలువైన మద్యం విక్రయాలు జరగడం గమనార్హం. మొత్తం 8.30 లక్షల కేసుల లిక్కర్, 7.78 లక్షల కేసుల బీరు అమ్మకాలు జరిగాయి.

# పట్టణ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

మొదటి తరువాయి

తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్ కార్యాలయాల వద్ద నోటీసు బోర్డుల్లో ప్రదర్శించినట్టు పేర్కొన్నారు. ఎస్ఈసీ అధికారిక వెబ్‌సైట్ (టీ-పోల్)లో కూడా డ్రాఫ్ట్ ఓటరు జాబితా అందుబాటులో ఉన్నదని, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని ఓటర్లందరూ ఈ ముసాయిదా జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేవో వెంటనే సరిచూసుకోవాలని సూచించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 5వ తేదీలోగా ఫిర్యాదుల చేయొచ్చని పేర్కొన్నారు.

# త్వరలో వందే భారత్ స్లీపర్ రైళ్లు

మొదటి తరువాయి

అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు అభిప్రాయపడ్డారు. దశల వారీగా ముఖ్య పట్టణాల్లో స్లీపర్ కోచ్ రైళ్లను ప్రారంభిస్తారని, హైదరాబాద్ నుంచి కూడా ఈ రైలును ప్రారంభించే అవకాశం ఉందని చెప్పారు. సదుపాయాలు ఇవీ..డిజిటల్ ప్యాసింజర్స్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్స్, ఆటోమేటిక్ డోర్స్ కవచ్ సేఫ్టీ సిస్టమ్, క్రాష్ వర్తీ సెమీ పర్మినెంట్ కప్లర్స్, రీ జనరేటివ్ బ్రేకింగ్ టెక్నాలజీ, కోచ్‌ల మధ్య ఫైర్ బ్యారియర్ డోర్స్, ఎమర్జెన్సీ టాక్ బ్యాక్ సిస్టమ్స్, ఏరోసల్ బేస్డ్ ఫైర్ డిటెక్షన్ సిస్టమ్, అలాగే అత్యాధునిక మరుగుదొడ్లు, సీసీటీవీ కెమెరాల వంటి సౌకర్యాలు ఈ రైల్లో ఉంటాయి.

# న్యూ ఇయర్ వేడుకల్లో స్విట్జర్లాండ్ బార్‌లో పేలుడు

మొదటి తరువాయి

క్రాన్స్-మోంటానాలోని దవాఖానలు కాలిన గాయాలతో చేరిన రోగులతో నిండిపోయాయి. ఘటన జరిగిన తర్వాత దట్టమైన నల్లని పొగ బార్ నుంచి వెలువడుతున్న దృశ్యాలతో వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. క్రాన్స్ మోంటానాపై విమానాలు ఎగరకుండా నిషేధం విధించినట్లు పోలీసు ప్రతినిధి ఒకరు తెలిపారు. నాటకీయ పరిణామానికి దారితీసిన పరిస్థితులను నిర్ధారించడానికి అధికారులు దర్యాప్తును చేపట్టినట్లు స్విట్జర్లాండ్ ప్రాసిక్యూటర్ జనరల్ చెప్పారు.

# జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## -కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్, జనవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జనవరి 1 నుంచి జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలు, ఫ్లెక్సీలను గురువారం ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ మాసోత్సవాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జనవరి 1 నుంచి 31 వరకు జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో రహదారి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా అనేక విలువైన ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదు, రాంగ్ రూట్‌లో ప్రయాణించరాదు, అతివేగం నివారించాలన్నారు.జిల్లాలో ఫిట్నెస్ లేని వాహనాలపై, లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపే చోదకులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్టీవోను కలెక్టర్ ఆదేశించారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో రహదారి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించే విధంగా అధికారులు సమిష్టిగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు సహా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి చిన్న బాలు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# జూపల్లి భాస్కరరావు యువసేన అధ్యక్షుడు ఎండి సిరాజ్



**చారకొండ, జనవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
చారకొండ మండల పరిధిలోని జూపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు, యువసేన అధ్యక్షుడు ఎండి సిరాజ్ పుట్టినరోజు సందర్భంగా వెల్దండ మాజీ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావును హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అనూష జగపతి, ఉప సర్పంచ్ రియాజ్, షబ్బీర్, మల్లేష్ ముదిరాజ్, సత్యం యాదవ్, తాజ్ భాయ్, తిరుపతి మహేష్, శివ, విజయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపులి నాగారం గ్రామంలో ఆదివారం గంపజాతర





**మహేశ్వరం, జనవరి 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో జనవరి 4వ తేదీ ఆదివారం రోజున గంపజాతర నిర్వహించనున్నారు. గ్రామ సర్పంచ్ బండారి లింగం ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ వనముల జాతర కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.గ్రామంలో ఆనవాయితీగా చెట్ల మధ్య వనభోజనాలు చేసి తిరిగి వచ్చే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈసారి కూడా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు కలిసి జాతరను నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ మంచి పాండు యాదవ్, వార్డు సభ్యులు షాహాబుద్దీన్ ఖాన్, నయీమ్ ఖాన్, గణపురం మహేందర్, బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు బూర్గుల నవీన్ కుమార్, తోట్ల నరసింహ, ఆయాల మహిపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.గ్రామ సర్పంచ్ బండారి లింగం ముదిరాజ్ మాట్లాడుతూ ఆదివారం రోజున వనభోజనాల సందర్భంగా ప్రతి కుటుంబం తమ బంధుమిత్రులను, అక్కచెల్లెళ్లను పిలిపించుకొని అందరూ కలిసిమెలిసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు.

# వీరశైవ లింగాయత్ బలిజ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రచార కార్యదర్శిగా బొమ్మిశెట్టి శ్రీనివాసులు



**వెల్దండ, జనవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయులు బొమ్మిశెట్టి శ్రీనివాసులు, వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రచార కార్యదర్శిగా నియమితులయ్యారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొండా వీరన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా కెంచ వీరన్నను అధ్యక్షుడిగా, రాజేష్ కుమార్‌ను ప్రధాన కార్యదర్శిగా, శంకర్‌ను కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా కల్వకుర్తి పట్టణానికి చెందిన దేవరశెట్టి విశ్వనాథం, పోలే వీరేశంను, గౌరవ సలహాదారులుగా కొండనాగులకు చెందిన శాంతి వీరభద్రయ్యను ఎన్నుకున్నారు. అనంతరం కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.జిల్లా ప్రచార కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బొమ్మిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ, లింగ బలిజ సంఘం తరపున లింగాయత్ సమాజ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, సంఘం బలోపేతం కోసం ముందుకు వెళ్తామని తెలిపారు.

## ముఖ్యమంత్రికి నూతన సంవత్సం శుభాకాంక్షలు తెలిపిన ఆర్యవైశ్య ప్రముఖుడు చౌడవరపు మోహన్ రావు





**మహబూబాబాద్, జనవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్**
: మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు చౌడవరపు మోహన్ రావు నూతన సంవత్సరం ఆరంభ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు.అదే విధంగా ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కూడా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా చౌడవరపు మోహన్ రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, ప్రజలకు చేరాల్సిన పథకాలు సమర్థవంతంగా అమలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లాకు ఇప్పటికే నిధుల కేటాయింపులో పెద్దపీట వేశారని, ఇకముందు కూడా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేలా కృషి చేయాలని కోరారు.

# ఎలిగేడు మండలం పరిసర గ్రామాల్లో పెద్దపులి సంచారం !

# భయాందోళనలో ప్రజలు



**ఎలిగేడు, జనవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలం పరిసర గ్రామాల్లో పెద్దపులి సంచారం ప్రజల్లో ఆందోళనకు కారణమైంది. సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లె శివారు, కరీంనగర్ మండలం బహదూరఖాన్పేట ప్రాంతాల్లో రెండు రోజులుగా పులి సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎలిగేడు మండలం సుల్తాన్పూర్, లాలపల్లి గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.ఈ రెండు మండలాల గ్రామాలు పక్కపక్కనే ఉండటంతోపాటు రైతుల వ్యవసాయ పొలాలు విస్తరించి ఉండటంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న చేనులో పులి దాక్కుందని, రెండు రోజుల క్రితం రాత్రివేళ పొలాల వద్ద ఆవుపై దాడి చేసిందనే ప్రచారం గ్రామాల్లో భయాన్ని పెంచింది.రైతులు, గ్రామస్థులు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పులి సంచారం కారణంగా రాత్రివేళ పొలాలకు వెళ్లడానికి ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. గ్రామాల్లో భయభ్రాంతి వాతావరణం నెలకొంది.

## ఘనంగా ఎస్పీ చేత ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్‌కు సన్మానం



**జగిత్యాల, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆంగ్ల నూతన సంవత్సరం 2026 సందర్భంగా జగిత్యాల జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్‌ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, డీఎస్పీ (స్పెషల్ బ్రాంచ్) పి. వెంకటరమణ, ఇన్స్పెక్టర్ ఆరిఫ్ ఆలీఖాన్, ఎస్సై సీహెచ్. సతీష్ పాల్గొన్నారు.ఇండియన్ పోలీస్ మెడల్ అందుకోవడంతో పాటు, తెలంగాణ రాష్ట్రంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో జగిత్యాల జిల్లా మొదటి స్థానాన్ని సాధించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ సన్మానం నిర్వహించారు.అధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్ సేవలను ప్రశంసిస్తూ, ఆయన కృషి జిల్లా పోలీస్ వ్యవస్థకు గర్వకారణమని పేర్కొన్నారు.



## ఘనంగా విశ్వకర్మ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



**హుస్నాబాద్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని విశ్వకర్మ బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ అఖిల భారత విశ్వకర్మ పరిషత్ సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. మండల ఉపాధ్యక్షుడు ఉప్పుల శ్రీనివాస్ చారి వారి తేజ ప్లైవుడ్ హార్డ్వేర్, యూ పి వి సి గ్లాస్ & లక్ష్మీ సామిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అతిథులుగా జిల్లా కార్యవర్గ సభ్యుడు, మండల అధ్యక్షుడు ఎగ్గోజు సుదర్శనాచారి, మండల కార్యదర్శి కందారపు రాజమౌళి చారి, కుచానపల్లి గ్రామ వార్డు సభ్యుడు కూరెళ్ళ సంతోష్ చారి, దేవోజు రాజమౌళి చారి, మీర్జాపురం సత్తయ్య చారి, బండోజు రాజు, కొత్తపెల్లి మహేందర్ చారి, జున్నోజు ప్రవీణ్ చారి తదితరులు హాజరయ్యారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని విశ్వకర్మ సంఘం ఐక్యతను చాటుతూ ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

## ఘనంగా పోలీస్ కమిషనరేట్‌లో నూతన సంవత్సర వేడుకలు



**కరీంనగర్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా పాల్గొని, అధికారులు మరియు సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026వ సంవత్సరం పోలీస్ కుటుంబాలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. గతేడాది శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో పనిచేసిన అధికారులను అభినందిస్తూ, కొత్త సంవత్సరంలో ప్రజలకు మరింత చేరువవుతూ మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అదనపు డిసిపిలు వెంకటరమణ, భీం రావు, ఏసీపీలు, సిఐలు, ఆర్ఎస్ఐలు, కమిషనరేట్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## మత్తు పదార్థాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

**సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



యువత లక్ష్యాన్ని దిశగా నడవాలని, వ్యసనాలకు బానిస కాకూడదని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పిలుపునిచ్చారు. అలుగునూరులోని ఎస్.ఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన మత్తు పదార్థాలు యువతపై దుష్ప్రభావాలు అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 1620 ఏళ్ల వయసు విద్యార్థి దశ అత్యంత కీలకమని, చెడు సావాసాల వల్ల చాలామంది పెడదారి పడుతున్నారని హెచ్చరించారు. సరదాగా మొదలైన అలవాటు వ్యసనంగా మారుతుందని, అలాంటి వారిని వెంటనే దూరం పెట్టాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడితే తల్లిదండ్రులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. చదువుల ఒత్తిడి సహజమని, దానిని తగ్గించుకోవడానికి ఆటలు, సంగీతం వంటి సృజనాత్మక రంగాల వైపు మళ్లాలని ఆయన సూచించారు. సోషల్ మీడియా కూడా కొత్త వ్యసనంగా మారుతోందని హెచ్చరిస్తూ, రోజుకు అరగంట కంటే ఎక్కువ రీల్స్ చూస్తే అది బానిసత్వమేనని స్పష్టం చేశారు. తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా క్రమశిక్షణతో ముందుకు సాగాలని, వ్యసనాలు విద్యార్థుల భవిష్యత్తుకు స్పీడ్ బ్రేకర్లవంటివని ఎస్.ఆర్ కాలేజీ జోనల్ ఇన్‌ఛార్జ్ తిరుపతి అన్నారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎస్సై శ్రీకాంత్, ఎస్.ఆర్ కాలేజీ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

# సమిష్టిగా రోడ్డు ప్రమాదాలను నియంత్రిద్దాం

**- అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**



**కరీంనగర్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం ప్రారంభ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. జనవరి 1 నుంచి 31 వరకు జరగనున్న రోడ్డు భద్రత మాసోత్సవంలో రవాణా శాఖ, ఆర్టీసీ, ఆర్ అండ్ బి, ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించి, వారు తమ తల్లిదండ్రులకు వివరించేలా చూడాలని సూచించారు. అతివేగం, డ్రంకన్ డ్రైవ్, మొబైల్ ఫోన్ వాడుతూ వాహనాలు నడపడం వంటి నిర్లక్ష్యాలను నివారించాలని, సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలు వెంట తీసుకెళ్లాలని ఆమె పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, బ్లాక్ స్పాట్స్ వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత మాసోత్సవానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించి, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిటిసి పురుషోత్తం, డిటిఓ శ్రీకాంత్ చక్రవర్తి, ఆర్టీసీ, ఎక్సైజ్, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభోగంగా అయ్యప్ప పడి పూజ



**గంగాధర, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్‌లోని ఆనందగిరి సుందర శాస్త్ర అయ్యప్ప దేవాలయంలో ఈ రోజు పడి పూజ ఘనంగా నిర్వహించారు. కన్నె స్వామి సన్నిధానంలో గురుస్వామి సిరిసిల్ల ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో ఆలయం నిర్మాణ ప్రదాత శ్రీరామ్ శ్వేతా మధుకర్ సమక్షంలో సుందర శాస్త్రకు పంచామృత ఫలాభిషేకాలు చేశారు. వేదపండితులు హరి శర్మ, జి.కె. గురుస్వామి మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం భక్తి వాతావరణంతో మారుమ్రోగింది. భక్తులు, స్వాములు అయ్యప్ప నామస్మరణ, భజనలతో పాల్గొని అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. బిక్ష చేసి అయ్యప్ప కృపకు పాత్రులయ్యారు.

## బాలికల జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్‌గా ఉష నియామకం



**మంథని, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్‌గా ఎఫ్.ఏ.సీ.గా ఉష గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేసిన సయ్యద్ సలీం బుధవారం పదవీ విరమణ పొందడంతో, బాలుర కళాశాల ప్రిన్సిపల్‌కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఉష మాట్లాడుతూ అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బంది ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు.

## ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన దోమ మండల ఎస్ఐ వసంత్ జాదవ్

**దోమ జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



నూతన సంవత్సర ప్రారంభోత్సవం సందర్భంగా పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్ రెడ్డి, పరిగి ఎస్సై మోహన్ కృష్ణ, చెంగోముల్ ఎస్ఐ భరత్ కుమార్ రెడ్డి, దోమ ఎస్ఐ వసంత్ జాదవ్, కుల్కచర్ల ఎస్ఐ రమేష్, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూడా వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## జాతీయ రహదారిపై అధికారుల నిర్లక్ష్యం



**హుస్నాబాద్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ఎల్కతుర్తి మీదుగా వెళ్లే మెదక్‌సిద్దిపేట జాతీయ రహదారి పనులు నెలల తరబడి నత్తనడకన సాగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, రహదారి విస్తరణ పనులు పూర్తి చేయకపోవడంతో నడిరోడ్డుపై కంకర విస్తరించి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఇప్పటికే పలువురు గాయపడటంతో పాటు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో సూచిక బోర్డులు, హెచ్చరికలు లేకపోవడం వల్ల ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగుతున్నప్పటికీ ఆర్ అండ్ బి అధికారులు పనులపై పర్యవేక్షణలో విఫలమయ్యారని ఆయన విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని ప్రాణనష్టాలు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తక్షణమే రోడ్డు పనులను వేగవంతం చేసి, నడిరోడ్డుపై ఉన్న కంకర తొలగించి ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభం



**హుస్నాబాద్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
2026 జనవరి 1న హుస్నాబాద్ డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. డిపో మేనేజర్ వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుస్నాబాద్ ఎంవిఐ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంవిఐ మాట్లాడుతూ డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని, వింటర్ సీజన్‌లో పొగమంచు, ఎదురువాహనాలపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడకూడదని, పాలచర్లను గమనిస్తూ బస్సులు నడపాలని, డ్యూటీల మధ్య సరైన విశ్రాంతి తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రమాదరహిత సీనియర్ డ్రైవర్లను సన్మానించారు. ట్రాఫిక్ సూపర్వైజర్ మురళీ, గ్యారేజ్ సూపర్వైజర్ పోచయ్య, టి ఐ-3 తిరుపతి డిపో ఏడీసీలు మహేందర్, రాజిరెడ్డి, మోహన్, స్వామి, సెక్యూరిటీ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# శాతవాహన విశ్వవిద్యాలయంలో కొత్త నియామకాలు









**కరీంనగర్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయంలో పలు కీలక నియామకాలు జరిగాయి. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ కే. పద్మావతి ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేయగా, రిజిస్ట్రార్ జాస్తి రవికుమార్, ఓఎస్డీ డా. డి. హరికాంత్ సమక్షంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. సమాజ శాస్త్ర విభాగంలో సహ ఆచార్యురాలిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె 2008లో సహాయ ఆచార్యురాలిగా నియామకం పొంది, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్నారు. ప్రస్తుతం ఎస్సీఎస్టీ సెల్ డైరెక్టర్‌గా కూడా కొనసాగుతున్నారు. మహిళా సెల్ డైరెక్టర్‌గా డాక్టర్ వి. నమ్రత రసాయన శాస్త్ర విభాగంలో సహా ఆచార్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ వి. నమ్రతను మహిళా సెల్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉపకులపతి ఉమేష్ కుమార్ ఉత్తర్వులు అందజేశారు. 2008లో సహాయ ఆచార్యురాలిగా నియామకం పొందిన ఆమె, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కూడా పనిచేశారు. మహిళా అధ్యాపకులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డాక్టర్ నమ్రత తెలిపారు. ఈ నియామకాలతో విశ్వవిద్యాలయంలో విద్యా, పరిపాలనా రంగాల్లో కొత్త ఉత్సాహం నెలకొననుందని విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

# ముఖ్యమంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన వెలిచాల రాజేందర్ రావు

**కరీంనగర్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నూతన సంవత్సరం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాజేందర్ రావు కరీంనగర్ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో 20 గ్రామాల్లో 11 గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడంలో తన పాత్రను వివరించారు. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు అర్ధరాత్రి వరకు కృషి చేసి, వారికి అన్ని



విధాలుగా వెన్నుదన్నుగా నిలిచానని ఆయన ముఖ్యమంత్రికి తెలిపారు. కరీంనగర్ నగరం, రూరల్, కొత్తపెల్లి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తాను గ్రౌండ్‌లో పనిచేస్తున్నానని వివరించారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కీలకంగా పనిచేసిన రాజేందర్ రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఇదే స్ఫూర్తితో కరీంనగర్ నగర పాలక సంస్థపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని, మున్సిపల్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి మేయర్ పీఠం దక్కించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. నూతన సంవత్సరం వేళ పార్టీ బలోపేతంపై, సర్పంచ్ ఎన్నికల్లో విజయంపై సీఎం రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేసి, రాజేందర్ రావును ప్రోత్సహించారు.

## పెద్దమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకున్న నిజాంబాద్ ఎమ్మెల్యే



**నిజాంబాద్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ఇందూరు నగరంలోని ప్రసిద్ధ శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయాన్ని నిజాంబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి, హిందూ సమాజం మరింత బలంగా నిలవాలని, సనాతన ధర్మం చిరకాలం వికసించాలని, నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ప్రార్థించారు. భారతీయ సంస్కృతికి ఆలయాలు, ఆచారాలు, సంప్రదాయాలే పునాది అని పేర్కొంటూ, దేవాలయ సంరక్షణ, హిందూ సంప్రదాయాల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ఇందూరు నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి, ధార్మికంగా, సాంస్కృతికంగా ఆదర్శ నగరంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కిషన్, బీజేపీ జిల్లా ప్రధాన నాగోళ్ళ లక్ష్మీనారాయణ, నాయకులు మఠం పవన్, పవన్ ముందడ, మరవర్ కృష్ణతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**వనపర్తి,జనవరి 01( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తెలంగాణ గజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో గురువారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో నూతన సంవత్సర శుభాకాంక్షల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరానికి సంబంధించిన టేబుల్ క్యాలెండర్‌ను కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బాణం విష్ణు, అసోసియేట్ అధ్యక్షులు జయరాములు మండల విద్యాధికారులు జయశంకర్,వరలక్ష్మి,గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వరప్రసాద రావు పాల్గొన్నారు, జిల్లా బాధ్యులు శాంతన్న జిహెచ్‌ఎంలు మల్లికార్జున భాస్కర్,మద్దిలేటి, మండల విద్యాధికారులు నరసింహ,కృష్ణయ్య,హనుమంతు తో పాటు ఇతర ప్రధానోపాధ్యాయులు, డీఈవో కార్యాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పలు పతకాలతో గౌరవించబడ్డ పోలీస్ శాఖ



**కరీంనగర్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే శౌర్య, మహోన్నత, ఉత్తమ, కఠిన సేవా పతకాలను ఈసారి కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో కైవసం చేసుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ, అంకితభావం, అసమానమైన సేవలందించినందుకు ఈ గౌరవం లభించింది. మహోన్నత సేవా పతకాలకు అడిషనల్ డీసీపీలు ఎం. భీంరావు, పి. వెంకటరమణ ఎంపికయ్యారు. ఉత్తమ సేవా పతకాలను సబ్‌ఇన్‌స్పెక్టర్లు సయ్యద్ అన్వర్, ఎస్. శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ ఇ. చుక్కా రెడ్డి అందుకున్నారు. కఠిన సేవా పతకాలను ఇన్‌స్పెక్టర్లు టి. కరుణాకర్, వి. శ్రీనివాస్, ఎ. సత్యనారాయణతో పాటు ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పెద్ద సంఖ్యలో సాధించారు. పతకాలు పొందిన వారిని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. ఈ అవార్డులు వారి వృత్తిపరమైన బాధ్యతను మరింత పెంచుతాయని, తోటి సిబ్బందికి స్ఫూర్తినిస్తాయని ఆయన పేర్కొన్నారు.

# ప్రెస్ క్లబ్‌లో నూతన సంవత్సరం సంబరాలు



**పెద్దపల్లి, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నూతన సంవత్సరం వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. పాత్రికేయులు కేక్ కట్ చేసి ఆనందంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రిక మిత్రులు ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, కొత్త సంవత్సరం అందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని భగవంతుని ప్రార్థించారు. కార్యక్రమంలో ప్రెస్ మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా గ్రామ పంచాయతీ సభ్యులకు సన్మానం



**గంగాధర, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం చొప్పదండి మండలంలోని రాగంపేట గ్రామ పంచాయతీ సభ్యులకు ఈ రోజు ఘనంగా సన్మానం జరిగింది. ఉపసర్పంచ్ రవీందర్ రెడ్డి, వార్డు సభ్యుడు కుమార్, మాజీ సర్పంచ్ మరియు ప్రస్తుత సర్పంచ్ రాజేశం, శ్రీమతి లత రాజేశం, వార్డు సభ్యుడు కుమార్‌లకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాం రెడ్డి ప్రత్యేకంగా పాల్గొన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు స్వామి, గోపాల్ రావు, వార్డు సభ్యురాలు నేరెళ్ల కవిత రాజు, చొప్పదండి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వప్న, జిల్లా మహిళా జనరల్ సెక్రటరీ స్వరూప, రాగంపేట మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కవితతో పాటు కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

**- కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నూతన సంవత్సరం సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, పౌర సంబంధాల అధికారి మాదంశెట్టి కృష్ణమూర్తి, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ జిల్లా అభివృద్ధి సాధించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. అధికారులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వాముల మహా పడిపూజ, ఇరుముడి





**ఇబ్రహీంపట్నం,జనవరి 01 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో బిఆర్ఎస్ నియోజవర్గ యువజన విభాగం నాయకులు మడుపు శివ సాయి గురు స్వామి ఆధ్వర్యంలో సింగమలై అయ్యప్ప స్వాముల మహా పడిపూజ, ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అన్నదాత ప్రభువు మాజీ పట్వారి జై శ్రీరామ్ రెడ్డి కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారీ ఎత్తున భక్తజనం వందలాది సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సంద్భంగా అన్నదాత



ప్రభువు మాజీ పట్వారి జై శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం లాగానే గత 20 సంవత్సరాలుగా అయ్యప్ప స్వాములకు అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల మానవుని జీవితం సన్మార్గంలో నడుస్తుందని గురు స్వాములు వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు నాయిని సత్యనారాయణ, ముత్యాల భాస్కర్, కాంగ్రెస్ నాయకులు ముత్యాల సంతోష్, ముత్యాల రాజు నిర్వాహకులు నందికొండ రవీందర్ రెడ్డి, జైన్ నరసింహారెడ్డి, తమ్మల కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి













**ఇబ్రహింపట్నం జనవరి 01(నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం ఉదయం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం లో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి , అనంతరం రాష్ట్ర మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు, ధనసరి అనసూయ (సీతక్క) , శ్రీ కోమట్ రెడ్డి వెంకట్ రెడ్డి , ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నీ కూడ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేసిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి .

## 56 వ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ




**అబ్దుల్లాపూర్ మెట్. జనవరి 01.(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ మాట్లాడుతూ కవాడిపల్లిలో విధ్యార్థి ఉధ్యమాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ చేశామని ఆయన అన్నారు ఎస్ఎఫ్ఐ నిరంతరం విధ్యార్థి సమస్యలు పై అలుపెరుగని పోరాటాలు చేస్తుందని ఆయన అన్నారు స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే మూడు ఆశయాల కోసం చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సమస్యల పై ఉధ్యమిస్తుంది అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అబ్దుల్లపూర్ మెట్ మండల అధ్యక్షులు ఫారుక్ పాషా నాయకులు శశి,సిద్ధూ,హరిష్, గణేష్,సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్ మున్సిపాలిటీలో ముసాయిదా ఓటర్ జాబితా విడుదల



**తూప్రాన్, జనవరి 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీలో ముసాయిదా ఓటర్ జాబితా గురువారం విడుదలైంది. తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో కలిసి జాబితాను ఆవిష్కరించారు. కమిషనర్ గణేష్ రెడ్డి మాట్లాడుతూ తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డులకు గాను మొత్తం 20,427 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో పురుషులు 10,100 మంది, మహిళలు 10,327 మంది ఉన్నారని వివరించారు. ఓటర్ జాబితాలో పేర్లు, చిరునామాలు తదితర అంశాలలో ఏవైనా మార్పులు లేదా అభ్యంతరాలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేయాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటరికి ఉన్న హక్కును వినియోగించుకునేలా ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేసిన భగత్ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం.



**గంగాధర,జనవరి 1 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కరీంనగర్ జిల్లా కరీంనగర్ లో ఈరోజు ఆర్థికంగా వెనుకబడిన భగత్ నగర్ వాసి రేగొండ రవికుమార్ పరమపదించినారు అతని దహన సంస్కారాల నిమిత్తము వారి భార్య అయిన పద్మకు 10,000( పదివేల రూపాయలు) భగత్ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం తరపున అందజేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కొల్లూరి హరిప్రసాద్, నాగమల్ల శ్రీనివాస్, పైడ రవి, పాల్గొనడం జరిగింది.



రాజ్ భవన్ లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బిల్డింగ్ కాంట్రాక్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరమల్ల భాస్కర్.

## మంత్రి కోమటిరెడ్డిని కలిసిన నల్లగొండ నూతన కలెక్టర్: బడుగు చంద్రశేఖర్



**నల్లగొండ, జనవరి 1 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని నూతన కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ఈ రోజు హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించారు జిల్లా అభివృద్ధికి అవసరమైన సహకారాలు అందిస్తానని జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి తెలిపారు నల్గొండ నూతన కలెక్టర్ కు మంత్రి శుభాకాంక్షలు తెలిపి, ఆల్ ది బెస్ట్ చెప్పారు.

## షాలోమ్ వర్షిప్ సెంటర్‌లోఘనంగా నూతన సంవత్సర వేడుకలు



**నల్లగొండ,జనవరి 1 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సుందరయ్య కాలనీ, హైదరాబాద్ రోడ్‌లో ఉన్న షాలోమ్ వర్షిప్ సెంటర్‌లో 2026 నూతన సంవత్సర వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి.కార్యక్రమంలో యూత్ క్వయర్ సభ్యులు నూతన సంవత్సరానికి సంబంధించిన ప్రత్యేక గీతాలను ఆలపించి భక్తులను ఆధ్యాత్మికంగా ఉర్రూతలూగించారు.ప్రధాన అతిథిగా విచ్చేసిన బిషప్ డా. సుధీర్ కుమార్ జిల్లెళ్ళ నూతన సంవత్సర సందేశం అందించి, భక్తులకు ఆశీర్వాదం ప్రసాదించారు. ఆ తర్వాత కేక్ కట్ చేసి వేడుకలను మరింత ఆహ్లాదకరంగా చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీమతి జ్యోతి, ప్రిస్కిల్లా, జాన్ సుదీప్, డేవిడ్ రాజు, ముత్తు, ప్రవీణ్, శేఖర్ రెడ్డి మరియు అనేకమంది భక్తులు పాల్గొన్నారు.షాలోమ్ వర్షిప్ సెంటర్ ద్వారా ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని ఆలయ కమిటీ తెలిపారు.

## టీజీవో క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్, జనవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆవిష్కరించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో టీజీవో యూనియన్ కార్యవర్గ సభ్యులతో కలిసి టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి లక్ష్యంగా అన్ని శాఖల గెజిటెడ్ అధికారులు పరస్పర సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయం పాటించాలన్నారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు జిల్లా ప్రగతికి ప్రతి అధికారి తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.టీజీవో సంఘానికి ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సంఘం ప్రతినిధులు కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం ఉపాధ్యక్షులు రామకృష్ణ గౌడ్, టీజీవో అధ్యక్షులు రాజశేఖర్ రావు, సహాయ అధ్యక్షులు ఖాజా మైనుద్దీన్, నాయకులు రాజు, రవీందర్ రెడ్డి, అశోక్ కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆమనగల్లు ఏసీపీ కార్యాలయాన్ని మహేశ్వరం డీసీపీ పరిధిలో కలపాలి

### ప్రభుత్వానికి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి విజ్ఞప్తి



**ఆమనగల్లు, జనవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రభుత్వ పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న చర్యలు అభినందనీయమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. నాలుగు మండలాలకు ముఖ్య కూడలిగా ఉన్న ఆమనగల్లు మండల కేంద్రంలో ఏసీపీ (పోలీస్) కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు పోలీసు సేవలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు.ఆచారి మాట్లాడుతూ "కడ్తాల్ పోలీస్ స్టేషన్‌ను ఆమనగల్లు ఏసీపీ కార్యాలయ పరిధిలోకి చేర్చడంతోపాటు, ఆమనగల్లు ఏసీపీ కార్యాలయాన్ని మహేశ్వరం డీసీపీ కార్యాలయ పరిధిలో కలిపితే పరిపాలనా సమన్వయం మరింత బలోపేతం అవుతుంది" అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడుగుల, తలకొండపల్లి మండలాల ప్రజలకు రంగారెడ్డి కలెక్టరేట్ సమీపంలో డీసీపీ కార్యాలయం ఉండడం వల్ల ప్రజలకు ప్రయాణం, కార్యాచరణల్లో సౌలభ్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు.ఈ మేరకు ప్రాంత అభివృద్ధి దృష్ట్యా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలని ఆచారి అభ్యర్థించారు. "ఆమనగల్లో ఏసీపీ కార్యాలయాన్ని సమర్థవంతంగా కొనసాగిస్తూ, కడ్తాల్ స్టేషన్‌ను ఇదే ఏసీపీ పరిధిలో కలపాలి. అలాగే ఆమనగల్లు ఏసీపీని మహేశ్వరం డీసీపీ పరిధిలో చేర్చేలా చర్యలు తీసుకుంటే ప్రజలకు భద్రతా సేవలు మరింత చేరువవుతాయి" అని విజ్ఞప్తి చేశారు.

# షాద్ నగర్‌లో ఘనంగా జాతీయ రోడ్డు భద్రత పోస్టర్ ఆవిష్కరణ



**షాద్ నగర్, జనవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రోడ్డుపై భద్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉప రవాణా శాఖ అధికారి వాసు ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మహోత్సవ పోస్టర్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ పట్టణ సిఐ విజయ్ కుమార్, నందిగామ సిఐ ప్రసాద్, కొత్తూరు సిఐ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవుల ఆరోగ్యంతో పాటు రోడ్డుపై ప్రయాణించే సమయంలో భద్రత కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. భద్రంగా ప్రయాణిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని పాటించాలని సూచించారు.ఏసిపి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రోడ్లపై అభద్రతగా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్ పిల్లలు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అతివేగం ప్రాణాలను బలి తీసుకుంటుందని, గమ్యం చేరాలంటే భద్రతే పరిష్కారం అని స్పష్టం చేశారు.ఉప రవాణా శాఖ అధికారి వాసు మాట్లాడుతూ భద్రతతో కూడిన గమ్యం కుటుంబానికి సురక్షితమైనదని పేర్కొన్నారు. జనవరి 1 నుండి 31 వరకు జాతీయ రోడ్డు భద్రత మహోత్సవ కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రయాణికులు ఇంటికి సురక్షితంగా చేరి కుటుంబంతో ఆనందంగా ఉండాలనే సంకల్పంతో ఈ మహోత్సవాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆర్టిఏ కార్యాలయ సిబ్బంది పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

# జినుకుంట్ల లింగయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తి

### నంద్యాల నరసింహారెడ్డి మాజీ ఎమ్మెల్యే



**నల్లగొండ, జనవరి 1 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నిరంతరం పేదల సమస్యలపై పోరాడుతూ కడవరకు కమ్యూనిస్టుగా బ్రతికిన కామ్రేడ్ జినుకుంట్ల లింగయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు గురువారం కనగల్లు మండలం ధర్వేశిపురం లో అమరజీవి కామ్రేడ్ జినుకుంట్ల లింగయ్య స్థూపాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో నంద్యాల నరసింహారెడ్డి మాట్లాడుతూ చిన్ననాటి నుండి ఎర్రజెండా చేతబట్టి గ్రామాలలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నడిపిన వీరుడు అని కొనియాడారు వ్యవసాయ కార్మికుల కూలి రేట్లు పెరగాలని, దున్నే వాడికే భూమి ,గీసే వాడికి చెట్టు ఉండాలనే నినాదంతో కల్లుగీత కార్మికుల హక్కుల కోసం గ్రామాలలో సొసైటీలు ఏర్పాటు చేసి హరాజు వేలం పాటలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారని అన్నారు. పాలేరులకు అతి తక్కువ జీతాలు ఇస్తూ వెట్టి చాకిరి చేయించుకుంటున్న భూస్వాములకు వ్యతిరేకంగా పాలేరులకు సంఘం పెట్టి జీతాల పెంపు కోసం ,మహిళల కూలీ గిట్టుబాటు కోసం వరి నాట్ల ,వరి కోతలకు కూలి రేట్లు పెంచడానికి పోరాటాలు నడిపాడని కొనియాడారు. అదేవిధంగా గ్రామానికి సర్పంచిగా ఎన్నికై ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఆయన నడిపిన పోరాటాల స్ఫూర్తితో నేటి యువత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై సంఘటితంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ చిన్ననాటి నుండి పోరాటాల వైపు నడిచిన లింగయ్య కడవరకు ఎర్రజెండా వీడలేదని ఆయన మరణం కనగల్లు మండల ప్రజానీకానికి సిపిఎం పార్టీకి తీరని లోటు అని ఆయన పోరాడిన జెండాను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు ఘనమైన నివాళి అని అన్నారు ఆయన స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన విబిజీ రాంజీ పథకాన్ని కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు కోసం గ్రామ గ్రామాన ఊరేగింపులు చేయాలని జీవోలను దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు సిపిఎం మండల కార్యదర్శి కానుగు లింగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం , పాలడుగు ప్రభావతి జిల్లా కమిటీ సభ్యులు, పుచ్చకాయల నర్సిరెడ్డి, నన్నూరి వెంకటరమణారెడ్డి , దండంపల్లి సత్తయ్య ,కొండ అనురాధ, గీతసంఘం జిల్లా అధ్యక్షులు కొండ వెంకన్న, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్ సిఐటియూ జిల్లా నాయకులు అవుట రవిందర్, నల్లగొండ, తిప్పర్తి మండల కార్యదర్శి మన్నె బిక్షం, నలపరాజు సైదులు ధర్వేశిపురం గుడి చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రాయల శేఖర్, మాజీ చైర్మన్ లు అలుగుబెల్లి నర్సిరెడ్డి, దీప కరుణాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చీదేటి కృష్ణారెడ్డి ,చర్లగౌరారం మాజీ ఉపసర్పంచ్ చింతలబహ్మాయ్య, పార్టీ మండల కమిటి సభ్యులుచీదేటి బ్రహ్మానందరెడ్డి కందుల సైదులు,యండీ అక్రం,యస్కే సుల్తానా,కుటుంబ సభ్యులు జినుకుంట్ల సైదులు, సునీత కృష్ణయ్య ,కలమ్మ ,చెనగోని యాదగిరి ,అంజమ్మ ,పాలకురి పుల్లయ్య, యాదమ్మ, మట్టపల్లి పాపయ్య, అండాలు, సిరిగల రాములు, అంశమ్మ,తదితరులు పాల్గొన్నారు

## మరువలేని ఎన్కౌంటర్ ఘటన



**పాలకుర్తి, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
1995 జనవరి 1 అర్ధరాత్రి పాలకుర్తి గ్రామం తుపాకుల మోతలతో రణరంగంగా మారిన ఘటనకు నేటికి 31 ఏళ్లు పూర్తయ్యాయి. పీపుల్స్ వార్ పార్టీ దళకమండర్ జడాల నాగరాజు గ్రామ నడిబొడ్డున ప్రజాకోర్టు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా పోలీసుల కాల్పులు ప్రారంభమయ్యాయి. బుల్లెట్ల వర్షంలో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఐదుగురు గ్రామస్థులు, నలుగురు నక్సలైట్లు ఉన్నారు. ఆ రాత్రి 11:30 గంటలకు జరిగిన ఈ భారీ ఎన్కౌంటర్ గ్రామాన్ని విషాదంలో ముంచేసింది. తెల్లవారుజామున వరకు తుపాకుల మోతలతో గ్రామం బిక్కుబిక్కుమంటూ గడిచింది. కొత్త సంవత్సరం వచ్చినప్పుడల్లా గ్రామస్తులు ఆ సంఘటనను గుర్తు చేసుకుని కన్నీరు మున్నీరవుతారు. ఈ ఘటనలో సాపిడి రాజు, దుర్గం కిష్టయ్య, దుర్గం బాపు, ముదాం శంకరయ్య, సోమిశెట్టి కనకయ్యతో పాటు నలుగురు నక్సలైట్లు హతమయ్యారు. బాధిత కుటుంబాలకు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి ప్రభుత్వ ఉద్యోగాలు, ఒక ఎకరం భూమి, పక్కా ఇళ్లు మంజూరు చేశారు. ఎన్కౌంటర్ సమయంలో ఇళ్ల గోడలకు తగిలిన బుల్లెట్ల రంధ్రాలు ఇప్పటికీ గ్రామంలో ఆ విషాదాన్ని గుర్తు చేస్తూనే ఉన్నాయి.

## ఘనంగా నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



**పాలకుర్తి, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించి ఐక్యతను చాటాలని ఈశాల తక్కల్లపల్లి గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ అన్నారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నేతన్న, రైతన్న ఒకే తల్లి కడుపున పుట్టిన సోదరుల్లా సమాజానికి సేవ చేస్తున్నారని, గ్రామంలో పద్మశాలీల అభివృద్ధికి అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పద్మశాలి సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఒడ్నాల జ్యోతి, వార్డు సభ్యులు, సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు వేముల నారాయణ, అధ్యక్షుడు ఒడ్నాల రాజు, ఉపాధ్యక్షుడు దీకొండ నర్సయ్య, ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్, కోశాధికారి ఒడ్నాల సురేష్, సహాయ కార్యదర్శి వేముల ఎల్లయ్యతో పాటు గ్రామంలోని ఇతర కుల సంఘాలు పాల్గొన్నారు.

## ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



**కరీంనగర్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నూతన సంవత్సరం సందర్భంగా నగరంలోని మంకమ్మతోటలో 37వ డివిజన్ మీకోసం, నగర బిఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకొని ఆనందంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా హరిశంకర్ మాట్లాడుతూ 2026వ సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. డివిజన్ ప్రజలకు, నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ వాసులు, మిత్రబృందం, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయవంతంగా పి ఆర్ టి యు వాల్ క్యాలెండర్ ఆవిష్కరణ



**కరీంనగర్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పి ఆర్ టి యు) తెలంగాణ రాష్ట్ర కరీంనగర్ జిల్లా శాఖ వాల్ క్యాలెండర్‌ను జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కొత్త సంవత్సరంలో పదవ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని, విద్యా శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మాజీ అసోసియేట్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ నూతన కార్యవర్గం

**గంగాధర, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో వాసవి క్లబ్ అధ్యక్షునిగా పడకంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తమ్మిశెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా ఇరుకుల్లా నాగార్జున్ ఎన్నికయ్యారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు క్లబ్ అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు.

## పెండింగ్ డిఏలను ప్రకటించాలి

### ఊకంటి విజేందర్ రెడ్డి



**కరీంనగర్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డి ఏలను నూతన సంవత్సర కానుకగా ప్రభుత్వం ప్రకటించాలని ఎస్‌జిటియు జిల్లా అధ్యక్షుడు ఊకంటి విజేందర్ రెడ్డి కోరారు. పిఆర్సి గడువు రెండు సంవత్సరాలు దాటిపోయినందున ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. టెట్ పరీక్షపై మాట్లాడుతూ, దశాబ్దాలుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి రిటైర్మెంట్ దశలో పరీక్ష రాయడం సమంజసం కాదని, ఇది అనేకమంది ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తోందని తెలిపారు. 2010కి ముందు నియామకమైన వారికి మినహాయింపు ఇవ్వాలని, టెట్‌లో అర్హత మార్కులు కూడా అసంబద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం టెట్ పరీక్ష రాసే ఉపాధ్యాయులందరికీ ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలని విజేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలోని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, అధికారులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సుడా చైర్మన్



**కరీంనగర్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నూతన సంవత్సరం సందర్భంగా హైదరాబాద్ సెక్రటరేట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్‌కు సంబంధించిన పలు అంశాలను ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## సేవకు చిరు సత్కారం



**కరీంనగర్ రూరల్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ రూరల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి సహకరించి, పిల్లలకు అవసరమైన వస్తువులను అందించిన బొమ్మకల్ నాయకులు లయన్ మిడిదొడ్డి శ్రీలత, కపిల్ మాధవ, పురుమల్ల శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అంగన్‌వాడీ నిర్వాహకులు మాట్లాడుతూ, 33 కేంద్రాలకు పిల్లలు కూర్చోవడానికి మాట్‌లు త్వరలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్ నిర్మల, పద్మశ్రీ, నీల, కనకలక్ష్మి, స్వరూప, ఆదిమల్లమ్మ, రాజకుమారి, రాజియాబేగం, మహేశ్వరి పాల్గొన్నారు.

## వార్డుల వారిగా డ్రాఫ్ట్ ఓటర్ లిస్టు విడుదల



**హుస్నాబాద్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్ర ఎలక్షన్ కమిషన్, మున్సిపల్ శాఖ ఆదేశాల మేరకు హుస్నాబాద్ పురపాలక సంఘానికి సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ లిస్టును వార్డుల వారీగా మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ కార్యాలయ నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఓటర్ లిస్టులో పేరు లేదా చిరునామా తప్పుగా ఉన్నవారు, అలాగే ఒక వార్డుకు చెందిన ఓటరు మరొక వార్డులోకి మార్పు కోరుకునే వారు ఈ నెల 10వ తేదీ లోపు లిఖితపూర్వకంగా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భీమా కోరేగావ్ వీరులకు ఘన నివాళులు



**హుస్నాబాద్, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
1818లో మహారాష్ట్రలోని భీమా కోరేగావ్ యుద్ధంలో పీష్వాలపై అల్పసంఖ్యాక దళిత బహుజనులు జరిపిన ఆత్మగౌరవ పోరాటాన్ని స్మరించుకుంటూ గురువారం హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో అమర వీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ కేడం లింగమూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, జన జాగృతి కళా సమితి అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్‌తో పాటు దళిత బహుజన సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. భీమా కోరేగావ్ పోరాటం సమాజంలో ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని, ఇలాంటి కార్యక్రమాలు యువతలో చైతన్యం నింపుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## నా నేస్తం ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు యోగా శిక్షణ తరగతులు



**ఎలిగేడు, జనవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: ఎలిగేడు మండల కేంద్రంలోని నా నేస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ నెల 5వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఈ తరగతులు ప్రతిరోజూ ఉదయం 6.30 గంటల నుండి 7.30 గంటల వరకు ట్రస్ట్ భవనంలో జరుగుతాయి. పాల్గొనే వారు నెలకు కేవలం రూ.250 నామమాత్రపు రుసుము చెల్లించవలసి ఉంటుంది. తరగతులకు హాజరయ్యే మహిళలకు గ్రీన్ టీ అందించనున్నారు. ఆసక్తి కలిగిన మహిళలు మరిన్ని వివరాల కోసం యోగాచార్య సరితని 9398425316 నంబరులో సంప్రదించవచ్చని ట్రస్ట్ చైర్మన్ కట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వీరగోని లక్ష్మీనారాయణ తెలిపారు.

# సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా 2026 నూతన సంవత్సర వేడుకలు

**కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసిన సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి**




**మహబూబాబాద్, జనవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో నేడు ఘనంగా నూతన సంవత్సర వేడుకలు స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్ లో నిర్వహించడం జరిగింది . ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి కేక్ కట్ చేసి అనంతరం మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు అన్నారు ఈ నూతన సంవత్సరం మహబూబాద్ పట్టణ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని వారు ఎంచుకున్న లక్ష్యాలు నెరవేరాలని వారు పనిచేస్తున్న రంగాల్లో దినదిన అభివృద్ధి చెంది అందరూ ఆనందంగా ఉండాలని అన్నారు మానుకోటలో ప్రజలందరూ కులమతాలు లేకుండా ఐకమత్యంతో కలిసి మెలసి ఉండాలన్నారు ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పార్టీ శ్రేణులు అందరూ జనవరి 18న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే శతాబ్ది సభలు జయప్రదం చేయాలన్నారు ఈ నూతన సంవత్సరంలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను మానుకోట ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవిల్లి రవి, వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, చిదిరాల జ్ఞానేశ్వర్, మంద శంకర్, అల్లి వేణు,గాదం శ్యాంప్రసాద్ యాదవ్, పుల్లకండం రమేష్, బల్లెం శ్రీకాంత్, రాగం మల్లయ్య, మేక వెంకటేష్, మెతుకు కుమార్, ఓం ప్రకాష్, పరమేశ్వర్ ఉపాధ్యాయుడు, శ్రీనివాస్ చారి, శ్రీనివాస్ కూరాకుల పాల్ తండా శ్రీనాథ్ మంద శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్‌లో రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ





**మహబూబాబాద్, జనవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్లో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 1 నుండి 31 వరకు రోడ్డు భద్రత అవగాహన మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. “సీక్ సే సురక్ష టెక్నాలజీ సే పరివర్తన” అనే నినాదంతో ఈ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. జనవరి 1 నుండి 3 వరకు పోస్టర్లను, బ్యానర్లను ఏర్పాటు చేసి ప్రజలకు సీట్‌బెల్ట్, హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించనున్నారు. విద్యార్థులతో ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, ఉల్లంఘనలపై చర్యలపై అవగాహన కల్పించనున్నారు. జనవరి 4 నుండి 10 వరకు డ్రైవర్లకు కంటి పరీక్షలు, స్కూల్ బస్సుల భద్రత తనిఖీలు, వ్యాసరచన, క్విజ్ పోటీలు, బైక్ ర్యాలీలు, పాదాచారుల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జనవరి 11 నుండి 17 వరకు వాహనాల ఫిట్నెస్, పొల్యూషన్ పత్రాల తనిఖీలు, NSS/NCC వాలంటీర్లతో ర్యాలీలు, టాక్సీ, ఆటో డ్రైవర్లకు అవగాహన, ముగ్గుల పోటీలు, సినిమా హాళ్లలో ప్రదర్శనలు, గ్రామాల్లో ఉత్తమ రోడ్డు భద్రత పాటిస్తున్న గ్రామాన్ని ఎంపిక చేయడం జరుగుతుంది. జనవరి 18 నుండి 24 వరకు విద్యార్థుల పెయింటింగ్ పోటీలు, ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన, ఆర్టీవో కార్యాలయాల్లో ఆడియో సందేశాలు, పాఠశాలల్లో వర్క్‌షాపులు, నాటకాలు, సైకిల్ ర్యాలీలు, ఎలక్ట్రిక్ వాహనాల ద్వారా పర్యావరణ భద్రతతో రోడ్డు భద్రత, బస్టాండ్లు, ఆటో స్టాండ్లలో కరపత్రాల పంపిణీ, పిల్లల ఆటపాటల ద్వారా అవగాహన కార్యక్రమాలు జరుగుతాయి. జనవరి 25 నుండి 30 వరకు ప్రజా రవాణా భద్రత, రేడియం స్టిక్కర్ల తనిఖీలు, ప్రథమ చికిత్స, ప్రమాదాలకు ప్రతిస్పందన, వైద్యశాఖ, రెడ్‌క్రాస్ భాగస్వామ్యం, మీడియా ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుంది. జనవరి 31న ఉత్తమ అధికారులు, వాలంటీర్లు, పాఠశాలలు, డ్రైవర్లకు అవార్డులు పంపిణీ చేసి నెలవారీ నివేదికలను విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో జైపాల్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయిచరణ్, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# జీరో యాక్సిడెంట్ డిపోగా మహబూబాబాద్ ఆర్టీసీ





**మహబూబాబాద్, జనవరి 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆదేశాల మేరకు మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. డిపో మేనేజర్ వి.కళ్యాణి ఆధ్వర్యంలో ఏఎమ్‌విఐ వెంకట్ రెడ్డి, సాయి చరణ్ విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. గత 20 సంవత్సరాలకు పైగా ఎటువంటి ప్రమాదం జరగకుండా సేవలందించిన డ్రైవర్లు బి.రాజేశ్వరరావు, ఎస్.డి.సత్తార్, కె.హరికుమార్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు డ్రైవర్లు పాటించవలసిన నియమాలు, జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. డిపో మేనేజర్ వి.కళ్యాణి మాట్లాడుతూ మహబూబాబాద్ డిపో 2025లో జీరో యాక్సిడెంట్ డిపోగా గుర్తింపు పొందిందని, 2026లో కూడా అదే విధంగా డ్రైవర్లు అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు. సెల్‌ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయరాదని, ఎదురుగా వచ్చే వాహనాలను ముందుగానే గమనించి జాగ్రత్తగా నడపాలని, ప్రయాణికుల క్షేమమే మన ధ్యేయమని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీమన్నారాయణ, ఎం.ఎఫ్. పాపిరెడ్డి, ఎడిసిలు, ఆఫీస్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, మెకానికల్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు



**హనుమకొండ, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** 2026 నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. హనుమకొండ జిల్లా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలను అభినందించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులుఅధికారుల సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఈ.వి. శ్రీనివాస్ రావు కూడా పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో రహదారి భద్రత మసోత్సవాల ప్రారంభం



**సిద్దిపేట, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : జాతీయ రహదారి భద్రత మసోత్సవాలు2026 సడక్ సురక్ష అభియాన్ కార్యక్రమం భాగంగా జనవరి 1 నుండి జనవరి 31 వరకు నిర్వహించబడే రహదారి భద్రతా మసోత్సవాలను గురువారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాయని, ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యాసంస్థలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండడం, రోడ్లపై సిగ్నల్స్, మార్కింగ్‌లను గమనిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాల్సిన అవసరం ఉందని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం అధికారులు రహదారి భద్రత ప్రతిజ్ఞ చేశారు. కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అదన కలెక్టర్ అబ్దుల్ హమీద్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, ఆర్టిఏ కమిటీ సభ్యుడు సూర్య వర్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వేద గ్రీన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలుపాల్గొన్న దైద రవీందర్





**నకిరేకల్ జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నకరికల్లు నియోజకవర్గం కేంద్రంలోని ఈరోజు గుడిపాటి ఫంక్షన్ హాల్ వేద గ్రీస్ మినిస్ట్రీస్ వారు ఆయన హెప్రాత ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి నూతన సంవత్సర వేడుకలలో పాల్గొని కేక్ కట్ చేసి అక్కడికి విచ్చేసిన నకరికల్లు నియోజకవర్గం ఆత్మీయ కుటుంబ సభ్యులైన అక్కలకు చెల్లెళ్లకు అన్నలకు తమ్ములకు అందరికీ ఇదేనా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దహీద రవీందర్ వీరితో పాటు తదితరులు పాల్గొన్నారు

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి



**మానకొండూరు, జనవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బెజ్జంకి క్రాస్ రోడ్ వద్ద గురువారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. గ్రామ పంచాయితీ భవనంలో నూతన సర్పంచ్ చిట్టంపల్లి రవళి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి, అనంతరం ఒకరినొకరు స్వీట్లు పంచుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తరువాత క్యాంపు కార్యాలయం తరఫున 2026 సంవత్సరపు క్యాలెండర్‌ను డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గ దామోదర్, లక్ష్మీనారాయణ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ముస్కు ఉపేందర్ రెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు కొమ్మెర రవీందర్ రెడ్డి, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, బైర సంతోష్, పసుల వెంకటి, రాజు, వాల అంజుత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## కొత్త ఏడాది బిగ్ షాక్..
### భారీగా పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర



కొత్త ఏడాది తొలిరోజే వినియోగదారులకు చమురు మార్కెటింగ్ కంపెనీలు బిగ్ షాక్ ఇచ్చాయి. ఇప్పటికే పెరిగిన ధరలతో అల్లాడుతున్న సామాన్యులపై మరో భారం మోపాయి. దేశవ్యాప్తంగా వాణిజ్య అవసరాలకు ఉపయోగించే సిలిండర్ ధరను భారీగా పెంచాయి. 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరపై రూ.111 బాదాయి. ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబై, హైదరాబాద్ సహా అన్ని ప్రధాన మెట్రో నగరాల్లో కొత్త ధరలు నేటి నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించాయి.ప్రతి నెల 1వ తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను సవరిస్తుంటాయి. అందులో భాగంగా కూడా సవరించిన ధరలను ప్రకటించాయి. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.1691.50కు పెరిగింది. కోల్‌కతాలో రూ.1,795, ముంబైలో రూ.1,642.50, చెన్నైలో రూ.1,849.50కి పెరిగింది. అయితే, కాస్త ఊరటనిచ్చే విషయం ఏంటంటే.. గృహ వినియోగం కోసం ఉపయోగించే 14.2 కిలోల సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులూ చేయలేదు. గత కొన్ని రోజులుగా వీటి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల ధరల పెరుగుదల హోటళ్లు, రెస్టారెంట్లు, చిరు వ్యాపారులపై మరింత భారం పడనుంది.

## న్యూఇయర్ వేళ BSNL నుంచి అదిరిపోయే గుడ్‌న్యూస్.. ఏంటో తెలుసా?




నూతన సంవత్సరం మొదటి రోజున దూచీూ వాయిస్ ఓవర్ వైఫై (వీఓడబ్ల్యూఐఎఫ్ఐ) సేవలను దేశమంతటా అందుబాటులోకి తీసుకువచ్చింది. వై-ఫై కాలింగ్ గా పిలిచే ఈ సేవ ఇక దేశంలో అన్ని టెలికం సర్కిళ్లలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు అందుబాటులోకి వచ్చింది. దీంతో నెట్ వర్క్ సవాళ్లు ఎదురయ్యే ప్రాంతాల్లో కూడా అధిక నాణ్యత కలిగిన మొబైల్ వైఫై కాలింగ్ సేవలు వినియోగదారులు పొందనున్నారు.దేశంలోని అన్ని టెలికం సర్కిల్లలో BSNL కస్టమర్లకు వైఫై కాలింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వై-ఫై నెట్‌వర్క్‌లో వాయిస్ కాల్స్ చేయడానికీ, వైఫై కాల్స్ పొందడానికి సంక్షిప్త సమాచారాన్ని పంపించడానికి వైఫై కాలింగ్ సేవలు ఉపయోగపడతాయి. ఇళ్లు, ఆఫీసులు, బేస్‌మెంట్లు, మారుమూల ప్రాంతాలు ఇలా మొబైల్ నెట్‌వర్క్ బలహీనంగా ఉండే ఏ ప్రాంతాల్లో మీరు ఉన్నా స్పష్టమైన కనెక్టివిటీ మీకు అందుతుంది. దీని వల్ల ప్రజలు ఎక్కడున్నా.. టెన్షన్ లేకుండా కాల్స్ మాట్లాడుకోవచ్చు. నెట్‌వర్క్ సమస్య అనేది ఉండదు.వైఫై అనేది IMS ఆధారిత సేవ. ఇది వై-ఫైకీ, మొబైల్ నెట్‌వర్కులకీ మధ్య ఇబ్బందులనూ ఎదుర్కోకుండానే మార్పిళ్లకు అనువుగా ఉంటుంది. ఇందులో థర్డ్ పార్టీ సేవల్ని పొందాల్సిన అవసరం లేకుండానే వినియోగదారుడు మొబైల్ నంబర్, ఫోన్ డయలరునూ ద్వారా కాల్స్ చేయొచ్చు. ఈ సేవ ముఖ్యంగా మొబైల్ సేవల లభ్యత పరిమితంగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో ప్రయోజనకరంగా ఉంటుంది.ఈ వైఫై కాలింగ్ సేవలు దూచీూ నెట్‌వర్క్ రద్దీని తగ్గించడానికి ఉపయోగపడుతాయి. ఇక్కడ ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే కంపెనీ వై-ఫై కాల్స్‌కు ఎలాంటి అదనపు ఛార్జీలు తీసుకోవట్లేదు. దూచీూ నెట్‌వర్క్‌ను దేశవ్యాప్తంగా విస్తరించడం, మెరుగైన సేవలను అందించే లక్ష్యంతో ఈ వైఫై కాలింగ్‌ను ప్రవేశపెట్టినట్టు బీఎస్ఎన్ఎల్ పేర్కొంది.

## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు..




నూతన సంవత్సరం తొలి రోజున దేశీయ సూచీలు లాభనష్టాలతో దోబూచులాడాయి. బుధవారం భారీ లాభాలను ఆర్జించిన సూచీలు గురువారం ఒడిదుడుకులకు గురయ్యాయి. ముఖ్యంగా ఎఫ్ఎమ్‌సీజీ సెక్టార్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోవడం సూచీలపై ఒత్తిడి పెంచింది. అయితే కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో టెలికాం సెక్టార్ లాభాలను ఆర్జించింది. అలాగే డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి నష్టపోవడం కూడా సూచీలను వెనక్కి లాగింది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ ఫ్లాట్‌గా రోజును ముగించాయి గత సెషన్ ముగింపు (85, 220)తో పోల్చుకుంటే గురువారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ రోజుంతా అదే ధోరణిని కనబరిచింది. గురువారం సెన్సెక్స్ 85, 101-85, 451 శ్రేణి మధ్యలో కదలాడింది. మధ్యాహ్నం తర్వాత మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో స్వల్ప నష్టాలు తప్పలేదు. చివరకు సెన్సెక్స్ 32 పాయింట్ల నష్టంతో 85, 188 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ మాత్రం స్వల్ప లాభాలను ఆర్జించింది. చివరకు 16 పాయింట్ల లాభంతో 26, 146 వద్ద స్థిరపడింది సెన్సెక్స్‌లో వొడాఫోన్ ఐడియా, ఏపీఎల్ అపోలో, సుప్రీమ్ ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి . ఐటీసీ, యునైటెడ్ స్పిరిట్స్, అవెన్యూ సూపర్ మార్కెట్, కేన్స్ టెక్నాలజీస్, మాన్‌కైండ్ ఫార్మా మొదలైన షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 129 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 265 పాయింట్లు ఎగబాకింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 89.96గా ఉంది

# స్పోర్ట్స్

## మళ్లీ రషీద్‌కే పగ్గాలు.. అఫ్ఘనిస్థాన్ స్క్వాడ్‌లో ఆల్‌రౌండర్లకే పెద్దపీట..!




కొత్త ఏడాది ఆరంభంలోనే క్రికెట్ అభిమానులకు పూనకాలు తెప్పించేందుకు పొట్టి ప్రపంచకప్ సిద్ధమవుతోంది. ఫిబ్రవరిలో మొదలయ్యే ఈ విశ్వ క్రీడా పోటీల కోసం అఫ్గనిస్థాన్ సెలెక్టర్లు స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీకి ఐదుగురు ఆల్‌రౌండర్లతో పటిష్టమైన బృందాన్ని ప్రకటించారు. రషీద్ ఖాన్ కెప్టెన్‌గా 15మందితో కూడిన స్క్వాడ్‌న వరల్డ్ కప్ బరిలోకి దిగనుంది.టీ20ల్లో సంచలన విజయాలకు కేరాఫ్ అయిన అఫ్గనిస్థాన్ ఈసారి ప్రపంచకప్‌లో సత్తా చాటాలనుకుంటోంది. రెండేళ్ల క్రితం రషీద్ ఖాన్ సారథ్యంలో పాకిస్థాన్‌కు షాకిచ్చిన కాబూలీ టీమ్.. సెమీస్ వరకూ వెళ్లింది. ఈసారి అంతకుమించి అంటే ఫైనల్, అదృష్టం కలిసొస్తే తొలి ఐసీసీ టైటిల్ ఒడిసిపట్టాలని రషీద్ సేన పట్టుదలతో ఉంది. ఉపఖండంలో, ఐపీఎల్‌లో ఆడని అనుభమున్న రషీద్, నబీ, నూర్ అహ్మద్, రహ్మనుల్లా గుర్బాజ్, ఒమర్‌జాయ్ వంటి ఆల్‌రౌండర్లు అఫ్గనిస్థాన్‌కు కొండంత బలం కానున్నారు.ఫిబ్రవరిలో మొదలయ్యే పొట్టి ప్రపంచకప్ కోసం వికెట్ కీపర్లుగా రహ్మనుల్లా గుర్బాజ్, మొహమ్మద్ ఇషాక్ ఎంపికయ్యారు. బౌలింగ్ విభాగంలో మిస్టరీ స్పిన్నర్ నూర్ అహ్మద్, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, ఫజల్‌హక్ ఫారూఖీ, నవీన్ ఉల్ హక్, ముజీబ్ ఉర్ రెహ్మన్ ఉన్నారు. మెగా టోర్నీ గ్రూప్ దశలో ఫిబ్రవరి 8న న్యూజిలాండ్‌ను రషీద్ సేన ఢీకొట్టనుంది.

**అఫ్గనిస్థాన్ టీ20 ప్రపంచకప్ స్క్వాడ్**

రషీద్ ఖాన్(కెప్టెన్), నూర్ అహ్మద్, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, సెదీకుల్లా అటల్, ఫజల్ హక్ ఫారూఖీ, నవీన్ ఉల్ హక్, మొహమ్మద్ ఇషాక్, షహీదుల్లా కమల్, మొహమ్మద్ నబీ, గుల్బదిన్ నబీ, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, ముజీబ్ ఉర్ రెహ్మన్, డార్విష్ రసూలి. ఇబ్రహీం జద్రానీ.

## సిడ్నీ టెస్టులో ఖవాజా.. ఆస్ట్రేలియా స్క్వాడ్ ఇదే..!




యాషెస్ సిరీస్‌ను గెలుపొందిన ఆస్ట్రేలియా నామమాత్రమైన ఐదో మ్యాచ్‌లో విజయంపై కన్నేసింది. మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్ షాకివ్వడంతో క్లీన్‌స్వీప్ అవకాశాన్ని చేజార్చుకున్న ఆతిథ్య జట్టు 4-1తో సిరీస్‌ను ముగించాలనుకుంటోంది. సిడ్నీ టెస్టు (ాఎంఅవఎ ంవర్)లో ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టాలనే ఉద్దేశంతో కొత్త ఏడాది మొదటి రోజే కంగారూ ఆటగాళ్లు నెట్స్‌లో చెమటోడ్చారు. ఆనవాయితీకి విరుద్ధంగా ఈసారి మ్యాచ్‌కు మూడు రోజుల ముందే క్రికెట్ ఆస్ట్రేలియా తమ స్క్వాడ్‌ను ప్రకటించింది. అయితే.. స్టీవ్ స్మిత్ సారథిగా 15 మందితో కూడిన బృందంలో ఏ మార్పులు చేయలేదని ఆ దేశ బోర్డు వెల్లడించింది.స్వదేశంలో జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో హ్యాట్రిక్ విజయాల తర్వాత తొలి ఓటమి ఎదురైంది ఆస్ట్రేలియాకు. పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో ఇంగ్లండ్‌ను చిత్తుగా ఓడించిన ఆసీస్.. మెల్‌బోర్న్‌లో మాత్రం తడబడింది. క్రిస్మస్ తెల్లారి జరిగిన బాక్సింగ్ డే టెస్టులో జోష్ టంగ్ విజృంభణతో కంగారూ బ్యాటర్లు తోకముడించారు. దాంతోడ 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైన స్టీవ్ స్మిత్ బృందం సిడ్నీలో పంజా విసరాలనుకుంటోంది. సిరీస్‌లో ఆఖరిదైన ఈ టెస్టులో చెలరేగి 4-1తో ట్రోఫీ అందుకోవాలని ఆతిథ్య జట్టు భావిస్తోంది. ఓపెనర్ నుంచి మిడిలార్డర్‌కు పడిపోయిన ఉస్మాన్ ఖవాజా సిడ్నీ టెస్టు తర్వాత వీడ్కోలు పలుకుతాడనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇంగ్లండ్ విషయానికొస్తే.. .. 14 ఏళ్ల తర్వాత మెల్‌బోర్న్‌లో విజయంతో సిరీస్‌లో బోణీ చేసింది. కుర్రాళ్లు జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్సే, జోష్ టంగ్ రాణించడంతో ఆస్ట్రేలియాకు చెక్ పెట్టిన ఇంగ్లండ్ .. సిడ్నీలోనూ గెలుపుపై ధీమాగా ఉంది. జనవరి 4న సిడ్నీ మైదానంలో ఇరుజట్ల మధ్య చివరి టెస్టు జరుగనుంది.

**ఆస్ట్రేలియా స్క్వాడ్ :**

స్టీవ్ స్మిత్(కెప్టెన్), ట్రావిస్ హెడ్, బ్యూ వెబ్‌స్టర్, మార్నస్ లబూషేన్, అలెక్స్ క్యారీ(వికెట్ కీపర్), బ్రెండన్ డగెట్, కామెరూన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా, టాడ్ మర్ఫీ, మైఖేల్ నెసెర్, జై రిచర్డ్‌సన్, మిచెల్ స్టార్క్, స్కాట్ బొలాండ్.

## షమీకి మళ్లీ జట్టులోకి ఛాన్స్ !!




భారత్ పేసర్ మొహమ్మద్ షమీకి మంచి రోజులు వచ్చే అవకాశాలున్నాయి. త్వరలోనే అతడు భారత జట్టులో పునరాగమనం చేయనున్నాడు. భారత క్రికెట్ నియంత్రణ మండలి కొత్త రూట్ ఎంచుకున్నట్లు తెలుస్తోంది. పాత ప్లేయర్లకు మళ్ళీ అవకాశాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. గౌతమ్ గంభీర్ కారణంగా జట్టుకు దూరమైన ప్లేయర్ల అందరిని మళ్లీ తీసుకువచ్చేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్లాన్ చేస్తున్నట్లు నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. చాలా రోజులుగా టీమిండియా కు దూరం అయిన మహమ్మద్ షమీ, జట్టులోకి రీ ఎంట్రీ ఇవ్వనున్నారని టాక్ వినబడుతుంది. ఇదే జరిగితే, గౌతమ్ గంభీర్ కు షాక్ తగిలే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ విపరీతమైన వేగంతో బౌలింగ్ చేస్తాడు. అదే సమయంలో వికెట్లు కూడా తీయడంలో దిట్ట. 2023 వన్డే వరల్డ్ కప్ సమయంలో లీడింగ్ వికెట్ టేకర్ గా మహమ్మద్ షమీ నిలిచాడు. ఆ తర్వాత గాయపడిన మహమ్మద్ షమీ జట్టుకు దూరమయ్యాడు. అప్పటినుంచి అతనికి సరిగ్గా బీసీసీఐ అవకాశాలు ఇవ్వడం లేదు. దీనికి ముఖ్య కారణం గౌతమ్ గంభీర్, అజిత్ అగార్కర్ అని సోషల్ మీడియాలో వార్తలు వస్తూ ఉంటాయి. అయితే ఇప్పుడు మహమ్మద్ షమీకి అవకాశం ఇవ్వాలని అనుకుంటున్నారు. చాలాకాలంగా పక్కనపెట్టిన షమీ విషయంలో బిసిసిఐ తాజాగా యూటర్న్ తీసుకున్నట్లు తెలుస్తోంది. 2027 వన్డే వరల్డ్ కప్ కోసం సెలక్టర్లు అతన్ని పరిశీలిస్తున్నారట. షమీ దేశ వాలి ప్రదర్శన అదుతేంగా ఉంది. పునరాగమనం దగ్గరలోనే ఉందని బీసీసీఐ వర్గాలు కూడా చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. న్యూజిలాండ్ సిరీస్ కు కూడా అతడు ఎంపిక చేసే అవకాశాలున్నాయి. గౌతమ్ గంభీర్ తో పాటు అగార్కర్ వద్దని ఎంత వాదించిన బీసీసీఐ అస్సలు వినిపించుకోవడంలేదట. వాళ్లను కాదని షమీని సెలెక్ట్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటివరకు 94 ఫస్ట్ క్లాస్ క్రికెట్ మ్యాచ్ లు ఆడిన మహమ్మద్ షమీ 339 వికెట్లు పడగొట్టాడు.